


# అతడు ఆమె

శ్రీ "రావు"

౧

అమ్మని, నాన్ననీ చూడాలని పోరుపెడితే వాళ్ళని పుట్టింటికి పంపేసి నేనుమాత్రం వేసవి సెలవులకి పట్నం లోనే వుండిపోయాను. అందుకు ముఖ్యమైన కారణాలు రెండూ; ఒకటోది - మావూళ్ళోనూ మా అత్తారివూళ్ళో నూ ఎండలు మండిపోతూ వుంటాయి; రెండోది - యిక్కడ బీచిలో లాగ అక్కడెక్కడా యేమిన్నీ విశేషాలు కనిపించవు.

ప్రతిరోజూ సాయింత్రం నాలుగున్నరకల్లా అవశిష్టాలన్నీ తీర్చుకుని ట్రిప్లికేను బీచినించి ఫోర్టువరకూ వెళ్ళడం, అక్కడ కాస్సేపు కూచుని తిరిగీ వెనకదారిపట్టి రేడియో దగ్గిర కొన్ని నిమిషాలు గడిపి హోటేలుముఖం పట్టడం నా నిత్యకృత్యం. అలా తిరగడం చల్లగాలి కనుకోండి, విశేషాలు కనిపెట్టడాని కనుకోండి - ఎలా గనుకున్నా నాకేమీ అభ్యంతరం లేదు.

ఆరోజుకూడా మామూలుగానే ఫోర్టుదాకా వెళ్ళేను. వెళ్ళేటప్పుడు యేవిశేషాలూ కనిపించలేదు. తిరుగుదలలో "వార్ మెమోరియలు" దగ్గిరికి ఒచ్చేసరికి ఒకవిశేషం కనిపెట్ట గలిగాను. అది వాళ్ళకి మామూలే కావచ్చును నాకుమాత్రం విశేషమే.

"రెండూ వక్కసారే వచ్చాయి, ఒకరిక్షా, ఒక కారున్నూ, రిక్షాలో ఒక పద్ధెనిమిదేళ్ల అమ్మాయి వున్నాది. కార్లో నలుగురు పెద్దమనుషు లున్నారు. అందులో ముగ్గురు గాక ఒక ప్రౌఢయువతి సీటులో ఉన్న అతనితో యేమేమో మాట్లాడి, గానీ యిద్దరికీ గాలి మారాక యిప్పటిలో సేదల కబురు. అతనుమాత్రం కారులోనే ఉండిపోయాడు. రిక్షా కారుకి ముఖాముఖీగా పదిగజాల దూరంలో నుంచుంది.

వయస్సులో వున్న స్త్రీపురుషులకి అందచందాల్లో లోపాలున్నా కనిపించవు. ఒకరి నొకరు చూసుకోవడం అట్టే వింతకాదు. అలాంటప్పుడు అతడూ - ఆమే ఒకర్నొకరు చూసుకోవడం - చూపులతోనే మాట్లాడుకోవడం - మందమందంగా హసించుకోవడం నాకు ఆశ్చర్యం కలిగించకూడదు. కానైతే కులస్త్రీకి అంత సాహసం వుంటుందా? నలుగురూ నడిచే రస్తాలో - నిర్భయంగా - పరాయిపురుషుడితో - చూపులతోనూ, వాటితోనూ యుద్ధం చేయగలుగుతుందా? అనే నాకు ఆశ్చర్యం కలిగింది.

ఏ లేడీ విలింగ్డనులోనో, ఏక్వీన్ మేరీస్ కాలేజీలోనో చదువుకుంటున్న దయితే నాకు ఆమే విషయంలో అణుమాత్రమూ ఆశ్చర్యం కలగనక్కర్లేదు. ఆమె వేషాన్నిబట్టి చూస్తే లేడీస్టూడెంటు లక్షణాలేమీ ఆమెలో కనిపించలేదు. ఇంతెందుకూ? ఆమే స్టూడెంటయితే రిక్షాలో దిష్టిబొమ్మలాగ తెల్లమొహం వేసుకు కూచుంటుందా గబగబా కాన్వర్ సేషన్ లోకి దిగక?

నేను వాళ్ళసంగతి కనిపెట్టలేదనే అనుకుని వుంటారు మొదట వాళ్ళు! కాని అదే నా బీచి షికారు ముఖ్యో

ద్దేశం కాబట్టి, కొంచెం దూరంలో నుంచుని, కోటు బొత్తాములు సరిచేసు కుంటున్నట్టూ, గాలి కెగురుతున్న కట్టుపంచెని సరిచేసు కుంటున్నట్టూ, క్రాపు సరిదిద్దు కుంటున్నట్టూ, ప్రకృతిశోభని పరికిస్తున్నట్టూ నటించి వాళ్ల చర్యలన్నీ కనిబెడుతున్నాను.

కొంతసేపటికి వాళ్లు నాదొంగతనం కనిపెట్టారు. ఏమర్థం చేసుకుందోగాని ఆమె చిరునవ్వు నవ్వింది. అతడు నావేపు చురచురా చూసేడు. నేనూ వూరుకోలేదు. నాతప్పేముంది గనక? చురచురా అతనివేపు చూస్తూ అట్టేసేపు అక్కడవుండడం భావ్యం కాదని నాదారి పట్టాను.

ఆమె—మగవాడిని మరిపింతాలు పెట్టి స్వేచ్ఛాప్రవృత్తికి బీచికివచ్చిన వన్నెల విసనకర్ర అని నే అనుకున్నాను.

## ౨

ఆరోజు ఆదివారం. రేడియో ప్రోగ్రాములో ద్వారం వెంకటస్వామి నాయుడుగారి వైలన్ ఒకాటి వుంది. నేను ఫోర్టుషికారు త్వరగా ముగించుకొని ఆరుగంటలకి ట్రిప్లికేను రేడియో చేరుకున్నాను. నాయుడు గారి వాయిద్యం బాగావినాలనే ఆసక్తి కలగటంచేత రేడియో దగ్గిరగా గచ్చుగోడమీద కూర్చున్నా, ఆడవాళ్లు కూర్చునే ప్రత్యేక స్థలానికి ఎదురుగా అలాంటిచోటే చాలామంది ఆశ్రయిస్తారుకదూ! అందులో నేనొకడిని. యింకా విశేషాలు కనిపెట్టడమే నా ముఖ్యోద్దేశం గనక ఆచోటు ఆశ్రయించక తప్పిందికాదు.

తమ ఆడవాళ్లు ఆ ప్రత్యేకస్థలంలో వున్న ముగాళ్లూ, లేని ముగాళ్లూ కూడా అజాగా ఆక్రమించారు. ఆడాళ్ల దృష్టి యిటున్నా, లేకపోయినా, యించుమించుగా యువకులందరి దృష్టీ మాత్రం ఆవేపునే వుంది.

అతనూ వచ్చాడు. నాకు మూడుగజాల దూరంలో ఆ గచ్చుగోడమీదే కూచున్నాడు. పక్కనున్న ముసలాయన ఆయనతో యేమేమో మాట్లాడుతున్నాడు గాని అతని కవేవీ వినబడుతున్నట్టు లేదనీ, అతని ధ్యాన్నమంతా ఆ ఎదుటివైపుకే వుందనీ, చూపులవల్లనే తెలుసుకున్నాను నేను. ఆమెకూడా తప్పకుండా వచ్చివుండాలని నేను అనుకుని, ఎదురుగా చూతునుగదా? అతనికి చాలా దగ్గిరగా వుండేటట్టే ఆమె ఆ ప్రత్యేకస్థలంలో కూచుని వుంది. ఆమెకూడా అతన్ని అప్పుడపుడు వాడి బాణాలతో కొడుతూ, పైట సర్దుకోవడం, యిత్యాదులవల్ల హావభావాల్ని వ్యక్తపరుస్తూ మోహముగ్ధుడిని చేస్తున్నదతడిని. ఆ సన్నివేశాల్ని బట్టి చూడగా వాళ్లు పాట వినటానికి రాలేదనీ, ప్రణయసముద్రంలో యీదటానికి వచ్చారనీ, నేను బోధపరుచుకున్నాను.

ఏడయింది. అతడులేచాడు. ఆమెకూడా లేస్తుందేమోనని నేననుకున్నాను. కాని ఏమనుమానించిందో లేవలేదు. అతను ఒకసారి యిటూ అటూ చూచాడు. ఆ దగ్గిరే వున్న నేను అంతనికంట బడ్డాను. అతను కొరకొర నావేపు చూశాడు. నేనూ చూశాను తీక్ష్ణంగా. నా తప్పేముంది గనక! అతనిమాదిరిగా నేను అన్యాయమైన పనికి సిద్ధపడితేగా యేవిధాన్నయినా భయపడడానికి? యెలాగైనా యితనికో గుణపాఠం చెప్పాలనే కదూ నా ఆశయం! అతనలా రోసరోస చూస్తూనే చరచగా నడిచిపోయాడు. ఆమె అతడు వెళ్లినవైపు ఒకసారి చూసి దృష్టి మరల్చుకోంది. ఆమరల్చుకోడంలో నేను ఆమెదృష్టి పథంలో పడ్డాను. ఆమె చటుక్కున తల వంచుకుంది.

[illegible]వాళ్ల మనః ప్రవృత్తిని గురించి ఆలోచిస్తూ నేను [illegible]గా పదినిమిషాల పాటు కూచున్నాను. యింతలో మరోయువకుడు వచ్చి నాదగ్గిరా నిలబడ్డాడు. అతనికళ్లు ఆడాళ్లలో ఎవరినో వెతుక్కుంటున్నాయి. 'ఆమె' యీ కొత్తమనిషిని చూసి చటుక్కున నుంచుంది. అతను దారితీశాడు. ఆమె అతన్ని వెంబడించింది. వాళ్ల వెనకాల పదిగజాల దూరంలో నేనూ వెంబడించాను వాళ్లని. ఇద్దరూ వక రిక్షా ఎక్కి వెళ్లిపోయారు. ఈ కొత్త ఆయన ఆమె అసలుమొగుడై వుంటాడని నేను నిశ్చయించుకున్నాను. ఈ దద్దమ్మకి ఆమె ప్రవృత్తి యేమీ తెలవదు గదా పాపం!

## 3

అది శనివారం. సాయంత్రం యేడుగంట లయింది. పార్థసారథిస్వామి దేవాలయం జనసమ్మర్దంతో కిటకిట లాడుతూ వుంది. ఆనాడు యించుమించుగా పట్నంలోని ఆడాళ్లందరూ దేవుడి దర్శనానికి వస్తారు. అలాంటివాళ్ల దర్శనానికీ, స్పర్శమాత్ర సౌఖ్యానికీ, ఎప్పుడు శనివారం వస్తుందా అని లెక్కపెట్టుకునే, మొగాళ్లూ వస్తారు. ఏమనుకున్నా అనుకోండి: నేనూ వెళ్లాను.

సింహద్వారం దాటి గర్భగుడి ముందున్న మంటపం చేరుకోవడమే చాలా కష్టమయింది నాకు! అక్కడి జన సమ్మర్దం సంగతి చెప్ప నక్కర్లేదు. ఆడా మొగా భేదం లేకుండా ఒకళ్ల మధ్యపడి ఒకళ్లు నలిగిపోతున్నారు. యింతట్లో యిరవైగజాల దూరంలో వున్న స్వామి విగ్ర హానికి పూజారిస్వాములు ఘంటానాదంతో కూడా నీరా జనం యివ్వడానికి ప్రారంభించారు. అది చూడడానికీ, ఆనూమం తమపైని ప్రసరింపించుకోడానికీ,. ఒకరిమీద



ఒకరు తొంగిచూస్తూ ముందుకి నెట్టుకోడం ప్రారం భించారు. నేను చాలాదూరంగా వుండడం చేత మడమల మీద నిలబడి తలపైకెత్తి పెరమాళ్ల వేపు. చూసేను పెరమాళ్ల స్వరూపంతో పాటు నాకు అతడి స్వరూపమూ, ఆమె స్వరూపమూ కూడా ప్రత్యక్షమయ్యాయి.

ఆమె యెడంచెయ్యి ఆమె మొగుడు పట్టుకుని వున్నాడు. ‘ అతడు ’ ఇదే మంచిసమయం అనుకుని ఆతొందరలో ఆమె దగ్గిర చేరుకుని మెల్లి మెల్లిగా కుడిచేతినే గ్రహించేడు. ఈ సన్నివేశానికి ఆమె అదర నన్నా అదరలేదు. ఆమెకి యిష్టమేగా యిది! ఏం సాహసం! ఒకవేపు మొగుడినీ, యింకోవేపు... దీనీ పెట్టు కుని యేం నిర్భయంగా వుందామె! యీ సన్నివేశాన్ని ఆమె మొగుడు కనిపెట్టినట్లు లేదు.

ఇది చూస్తున్న నాకేమీ ఆశ్చర్యం కలగలేదు. యిలాంటి వాళ్లందరూ - యిలాంటి సన్నివేశాలకోసమే - యిలాంటి చోట్లకి వస్తూవుండడం సహజమేకదూ!

వాళ్లు తిరుగుముఖం అయారు. నేనూ వాళ్లని వెంబ డించాను. ఆమెచెయ్యి భర్తపట్టుకుని ఆమెని గుంపు లోంచి ముందుకి యీడ్చుకెడు తున్నాడు. ఆమె వెంట బడ్డాడు “ అతడు.” వీలయి నప్పుడల్లా స్పర్శసుఖం కూడా అనుభవించడానికి అదే మంచి అవకాశం గదూ అతనికి!

యిదంతా కనిపెడుతూ వున్న నాకు వొళ్లుమండింది. “ అతని ” సంగతంతా, ఆమెభర్తతో పూసగుచ్చినట్లు చెప్పి తీరిన ప్రాయశ్చిత్తం చేయిద్దామనుకొంటిని నాకు! కాని తిరిగి ఆలోచించి వూరుకున్నా. లోకంలో యిలాంటివాళ్లు ఎన్ని వేలున్నారో! అందర్నీ మనం మరమ్మత్తు చెయ్యగలమా?

## ౪

ఎండగాడుపు చాలా ఎక్కువగా వుంది. ఆరు కొట్టినా, బీచిదగ్గిరకూడా యేమీ గాలిలేదు. నేను ఉక్క బాధ భరించలేక నీటివొడ్డుని కూచున్నాను. అప్పుడే కొంచెం గాలి - చల్లగాలి - వీచడం ప్రారంభించింది. ఏడు

న్నర గంటదాకా అక్కడినుంచి తాపం తీరేదాకా కదల లేక పోయాను; ఇంకా ఆలస్యం చేస్తే హోటల్లో పొడి మెతుకులు తినవలసి వస్తుందని లేచి తిరుగుముఖం పట్టాను. నాకు పదిగజాల దూరంగా యిసకలో అతడూ, ఆమే కూచుని యేమో మాట్లాడుకుని నవ్వుకుంటున్నారు. పుచ్చపువ్వులాటి వెన్నెల కాబట్టి నేను వాళ్లనీ, బాగా పోలికపట్ట గలిగినాను. ఇప్పటికి - ఆమె ప్రవృత్తి నిస్సందేహంగా నేను గ్రహించ గలిగేను.

## ౫

శుభలేఖ వచ్చింది మా భావమరిదికి పెళ్లని. అందరికీ మల్లే నాక్కూడా "సకుటుంబ సపరివారబంధుమిత్ర సమేతంగా దయచేసి, వధూవరుల నాశీర్వదించి, మత్కృత సత్కారంబుల గైకొని—" అని మామూళ్లతో కూడిన అచ్చుశుభలేఖ - మా మామగారి సంతకంతో వున్నది - వచ్చింది. అదిచూసి నావొళ్లు మండింది. అది చదివినంతసేపూ, పెళ్లికి పోగూడదని మనస్సున దృఢపరుచుకున్నాను, కాని, దానికి పిన్నుచేసి పంపిన రెండోవుత్తరం చూసేసరికి నా అభిప్రాయం మార్చుకో వలసి వచ్చింది. ఏమంటారా? అది శ్రీరాణీసాహెబాగారి ఫర్మానా. అందులోని సారాంశం యిదీ - నేను పెళ్లికి అక్కడికి వెళ్లకపోతే, ఆవిడగారు మరి యిక్కడికి గాపురం వస్తుందట! నచ్చేటట్టు నేనే తెమ్మని వారికి చేతివ్రాతగా రాసి పంపించింది కూడాను.

ముందుగా రావడానికి వీలులేదనీ, ఆమట్టుగా, ఆడపెళ్లివారి వూరికే సామానుతో కూడా వస్తాననీ విజ్ఞాపన చేసుకున్నా.

పెళ్లికి వెళ్లానన్న మాటేగాని నేను తరుచుగా ఎక్కడికీ వెళ్లక విడిదిలోనే ఉండేవాణ్ణి. ఆవేళకి భోజనానికి మాత్రం ఆడ పెళ్లివారింటికి వెళ్లేవాడిని.

ఒకనాడు వుదయం గదిలో నా కేంపుకాటుమీద పడుకొని యేదో చదువుకుంటున్నాను. దానికి ఎదురుగా వున్న హాలులోనే నలుగులూ, బంతులాటలూ ప్రారంభించేరు. ఆ ఆడవాళ్లలో నాకు "ఆమె" కనబడింది. నాకు ఆశ్చర్యం కలిగింది. ఆమె యిక్కడికెందుకు రావాలి? ఏమో ఆడపెళ్లివారికి యేమన్నా బంధువు అవుతుందేమో!

నేను గదిలో వున్నానని పాటలు పాడడానికి ఆడవాళ్లు మొహమాటం పడట్టుంది, మా ఆవిడ తలుపుదగ్గరసా మువ్వ్యాడానికి వచ్చింది. నేను దాన్నిలోపలికి పిలిచి, "ఆ ఆకుపచ్చచీర కట్టుకున్నావిడ యెవరు?" అని అడిగేను.

"ఆవిడే మా పెద్ద వొదినగారు. పెళ్లికూతురు అక్క."

"అట్లాగా! ఏమో అనుకున్నాలే! మంచి సంబంధమే చేశారే మీరు! చాలా సాంప్రదాయమయిన సంబంధమే!"

"ఏమిటలా అంటున్నారు? ఎవరికో వకరికీ, యేవో వంకలు పెడుతూనేవుంటారు మీరు. ఎరిగినా, ఎరగకున్నా."

"మంచి సాంప్రదాయమైన సంబంధం అని ఉన్న మాటే అంటే యీ పెడర్థం చేసుకోడం యెందుకూ?"

మొగం ముడుచుకుని అది తలుపు దభాలునవేసి పోయింది. కిటికీమాత్రం తెరిచే వుంది. బంతులాట చూడాలని వొకమాటు నేను కిటికీదగ్గరగా వెళ్లేను. అప్పుడామె కిటికీదగ్గరగానే కూచుని వుండడం చేత నన్ను చూసి తలవంచుకుని ఆటలు లేచి మరొకపక్కకి వెళ్లిపోయింది.

## ౬

ఆమెను చూచినదగ్గరనుంచీ నా మనస్సులో అదో మోస్తరుగా అనిపించింది. యేనాట్నుంచి టోపీలో పడ్డారనుకున్నాను. కాని ఎవ్వరితోటీ ఆమె సంగతి అనలేదు. అంటే మనకేనామోషి.

"ఆమె" వచ్చింది గనక, "అతడు" కూడా తప్పకుండా వచ్చే వుంటాడా వూరికి అని నేను ఊహించాను. నావూహ ఊరికే పోలేదు. అనాడు మధ్యాహ్నం మూడు గంటలప్పుడు ఒక స్నేహితుడిని చూడడానికి నేను బయలు దేరాను. దారిలోనే వకచోట తారసపడ్డాడు "అతడు." ఒకర్నొకరు నిదానించి చూసుకున్నాము.

ఇద్దరికళ్లూ ఎగ్రబారాయి. వెంటనే యిద్దరం తలలు వంచుకుని ఎవరి మానాన్ని వారు పోయాము.

అంత సాహసమా! “ఆమె”ను వెంటబెట్టుకొని ఆవూరుచేరి సిగ్గూ, బిడియమూ లేక తిరగడమా? నాకు వొళ్లు మండింది. ఎలాగన్నా “అతనికి” తగిన ప్రాయశ్చిత్తం చేయించాలని నిశ్చయించుకున్నా.

౭

సదస్యం అయిన మర్నాడు పన్నెండు గంటలకి అందరమూ భోజనాలుచేసి తిన్నాసీలమీద కూచుని తాంబూలం వేసుకుంటూ వున్నాం. అక్కడ వున్నవాళ్లల్లో ఆడపెళ్లివాళ్ల తరఫువారే ఎక్కువగా వున్నారు. పెళ్లిపెద్ద - అంటే - పెళ్లికూతురి పెద్దన్న దమ్ముడు అందరికీ తాంబూలాలు అందిస్తూ గౌరవిస్తున్నాడు. ఇంతలో ఎక్కడినుంచో వూడిపడ్డట్టు “అతడు” కూడా వచ్చాడక్కడికి. నా కాశ్చర్యం కలిగింది; అయినా పెళ్లివారికి పరిచితుడయి వుండవచ్చునని అనుకున్నా. పెళ్లిపెద్ద అతనికి తాంబూలం యిస్తూ “తీసుకోవోయ్ బావా! నువ్వొకన్నాడూ మాతో సరీగా భోజనానికి రాక అవిస్యం చేస్తున్నావ్! ఈవాళ తాంబూలానికేనా అందుకోవడం వక విశేషమే!” అని పలకరించేడు.

“అతడు” బావవరసకి తగినట్టుగానే వుంటున్నాడని వాళ్లతో చెప్పివేసి అతడికి * “నలభై” చేయిద్దామని తోచింది నాకు.

“ఆయన మీకు యెలాంటి బావండీ?” అని అడిగేను నేను, పెళ్లిపెద్దని.

“మా చెల్లెలు కమలం మొగుడు” అని జవాబిచ్చేడాయన.

నాకు చాలాఆశ్చర్యం కలిగింది. “అతడు” “ఆమె”కు పెనిమిటేనా? నాకు నాతప్పు బాగా అర్థమయింది. అతని మొహం చూడడానికి సిగ్గువేసింది. అతనికి చేదామనుకొన్న దేదో నాకే అయింది.

౮

రాత్రి తొమ్మిదిన్నర గంటలయి వుంటుంది. నేను విడిదిగదిలో నా కేంపుకాటుమీద పడుకుని “ఆమె”ను గురించే ఆలోచిస్తూ ఉన్నాను. “అతడు” “ఆమె”కు మగడే అయితే—“ఆ రిక్షామీద ఆమెను తీసికొని పోయినవాడూ, దేవాలయంలో ఆమెను చెయ్యిపట్టుకుని తీసికెళ్లినవాడూ ఎవరా? అనే నా ఆలోచన. యింతట్లో శ్రీ రాణీగారు గదిలోకి నవ్వుకుంటూ వచ్చి “గట్టివారే నండోయ్ మీరు! మొగుడికీ, పెళ్లానికీ రంకు కట్టారుట!” అని పలకరించింది.

నేను:—ఎవరన్నా రేమిటి అలాగ?

అది:—ఎవరేమిటీ? పిన్నిగారూ, పినపినాయనగారూ కూడాను. పాపం! మా కమలం వొదినె తలెత్తుకుని తిరగలేకుండా వుంది. మంచిపని చేశారులెండి!

నేను:—అనుమానం కలిగేటట్టు ఆవిడ ఎందుకు నడుచుకోవాలీ? అనుమానించేనంటే నాదా తప్పు?

అది:—పాపం! ఆవిడ పూసగుచ్చినట్లు జరిగిన సంగతులన్నీ నాతో చెప్పుకుంది. ఒకరోజున - ఆవిణ్ణి రిక్షాలో రమ్మని, అతను స్నేహితుల కారులో బీచికి వచ్చేడట! ఇద్దరూ, యెదురెదురుగా వుండగా మీరు ఆదారంట వస్తూ అనుమానించారట!

నేను:—ఔనులే! మరి రేడియో విని ఎవరితోనో రిక్షామీద పోయిందే యీవిడ! అతనెవరు?

అది:—అతనా? అతను మా రెండో భావగారు. కమలం వొదిన అన్నయ్యేగాని మరొహరుకాదు. అతనేదో పనిమీద అప్పు డక్కడికి వచ్చాడట! ఏవో అర్జంటు పనులుండటం చేత యిప్పుడు పెళ్లికి రాలేక పోయాడు.

నేను:—అట్లాచెప్పూ. దేవాలయంలో కూడా అతనే మావొదినె చెయ్యిపట్టుకుని జనసమ్మర్దంలోంచి తప్పించుకొచ్చినాడు. నేనేమో, అతనే యీవిడ మొగుడనీ, యితను పరాయివాడనీ అనుకున్నాను.

* అంటే “పరాభవం” అన్నమాట. పరాభవ ప్రభవాదుల్లో నలభయ్యో సంవత్సరం. పరాభవం అనడానికి “నలభై” అనే పదమునే యువకులు వాడుతున్నారిప్పుడు.

అది:—(నవ్వుతూ) ఎక్కువ చదివిన వాళ్ల పరిశోధనలన్నీ యిలాగే వుంటాయి కాబోలు, అసందర్భాలైన సంబంధాలు కల్పిస్తాను.

నేను:—నేను వెంటాడి తిరిగేనని వాళ్లేమనుకున్నారో యేమో ?

అది:—ఏమనుకున్నా మొగాళ్లే అనుకోవాలి. ఆవిడేమీ అనుకోలేదట. అతనుమాత్రం మీకు కొద్దిరోజులలో పచ్చబొట్టుతుందనే వాడట.


# మీకు తెలుసునా???

పారిస్ బంగారము అంటే శాస్త్ర సిద్ధముగా తయారు చేసిన యిమిటేషన్ బంగారపు దిమ్మెలు ఔన్సు 1కి (2½ తులములు) రూ. 6-0-0లు, 2 ఔన్సుల దిమ్మె రూ. 10-0-0, పౌను 1కి రూ. 72-0-0 చొప్పున అమ్ముతారు. చౌకగా తయారు చేసుకొనడానికి అసలయిన బంగారముతో కలపవచ్చును. ఆసిడ్ వేసి రుజువు చూసినా తెలియదు. సంతృప్తి కలిగించే గ్యారంటి యిస్తాము. లేక డబ్బు వాపసు పుచ్చుకొంటాము. పెద్ద మొత్తము కు ఆర్డరు యివ్వడానికి ముందు ఒకటి రెండు ఔన్సులు యీ పారీసు బంగారపు దిమ్మెలు తెప్పించుకొని చూడండి. నచ్చితే తరువాత విరివిగా మీరే తెప్పించుకొంటారు.

వుత్తరాలు యింగ్లీషులో కానీ ఫ్రెంచిలోకాని వ్రాయవలెను.

అన్ని చోట్ల ఏజంట్లు కావలెను

**HOUSE OF COMMERCE**

3, G. S. Road, GAUHATI

# మన్మథ శాస్త్రము

ముఖ్యముగ అందఱు చదువవలసినది

ఇందు, స్త్రీ పురుషజాతులు, ఏయేజాతి స్త్రీ యేయే పురుషునికి తగినది, స్త్రీని పురుషుడెట్లు వశ పఱచుకొనుట—యింకను ఎన్నో స్త్రీ పురుషులకు ముఖ్యముగ తెలియవలసిన విషయములు ఉన్నవి. వెల 8 అణాలు.

దిఓరియంటల్ బుక్ డిపో మద్రాసు

అక్షరాలు ముత్యాల కోవలు !

# "రత్నా యింప్రూవ్డ్"

కలాల్తో వ్రాస్తే ముత్యాలవంటి అక్షరాలు కుదుర్తాయి. ఇవి చాలాకాలం పనిచేస్తాయి.




నిప్పంటి మండవు; విరిగిపోవు; తేలికలాన్తుంటాయి. మంచి అందమైన బంగారు పాళీలు. వాని చివర 25-వ సంవత్సరములవఱకు పనిచేసే యిరిడియమ్ పొదగబడింది.

రకరకాల రంగులతో, రోల్డుగోల్డు క్లిప్పులతో ముద్దులు మూటగట్టే ఈకలాల వెల సరసం.

కావలెనంటే మీమీ పేర్లు కలాలపైన ఉచితంగానే చెక్కుతాం.

కావాలి

మీ అందఱి ప్రోత్సాహం.

# కె. రత్నా అండ్ కో.

(విద్యార్థులకు ప్రియమైన షాపు)

305, ఎస్ప్లనేడ్ రోడ్, మద్రాసు